
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

## పాప్యులర్..

"పాపులర్ నేను కాదమ్మా, నా వృత్తి.. ఈ నిజం నాకు తెల్లిసినరోజునుంచీ అంతా శాంతే"..నవ్వుతూ అన్నారాయన.

పచ్చని ఆ నవ్వుముఖం చందమామని గుర్తు చేసింది నాకు.

ఒక్క నిమిషం నిశ్శబ్దం మా ఇంట్లో.

--------------

సరిగ్గా నాలుగురోజుల క్రితం నా భర్త అమర్ పనిమీద విదేశానికి వెళ్ళినందువల్ల నాకు తోడుగా ఉండడానికి వచ్చారు అమ్మా నాన్నా. వచ్చినప్పటినించి అమ్మ తీసుకొచ్చిన తినుబండారాలు, ఊరగాయలు సర్దుకోవడం, ఎడతెరిపి లేకుండా కబుర్లు చెప్పుకోవడంతో మొదటి రెండు రోజులు సరిపోయింది.

మూడోరోజు నాన్న సరదాగా 'అలా సాయంత్రపు నడకకి వెళ్ళొస్తాను!' అంటూ కిందకి వెళ్ళి అరగంట కల్లా తిరిగి వచ్చారు. ఆయన ముఖం నిండా చెప్పలేని ఆనందం.

" అప్పుడే వచ్చేశారే? " అంది అమ్మ

" సరస్వతీ, ఎవరు కనిపించారో తెలుసా?" అన్నారు అమ్మ మాటని పట్టించుకోనట్టుగా.

" ఏమయింది నాన్నా? ఎవరు? తెలిసినవాళ్ళా?" అడిగాను నేను కూడా

" నువ్వు కూడా వినమ్మా, పావనీ, శ్రీధర్ గారు కనిపించారు, అవును ఆయనే, ఖచ్చితంగా ఆయనే. నువ్వెప్పుడూ చెప్పలేదేమమ్మా? శ్రీధరం గారు మీ అపార్ట్ మెంట్ లోనే ఉంటారని?" అన్నారు.

" శ్రీధర్ గారెవరు నాన్నా? నాకెవరూ తెలీదే ఆపేరుగలవాళ్ళు? మీ స్నేహితులా? మన బంధువులా?" అన్నాను నేను..

"కాదమ్మా! శ్రీధర్ గారంటే గొప్ప నటులు.. మా కాలంలో రంగస్థలాన్ని, చిత్రరంగాన్నీ ఏలినవారు. ఆయనంత గొప్ప నటుడు మరొకరు లేరనే చెప్పాలి. ఆయన చెయ్యని పాత్ర లేదు. ఆ వాచకం, అభినయం.. మరొకరి వల్ల అయ్యేవి కాదు.." సంబరంగా, గబగబా చెప్పుకుంటూ పోతున్నారు నాన్న.

" ఎవరు? గొప్ప కేరెక్టర్ నటుడు శ్రీధర్ గారే?" అమ్మ కూడా అంటోంది.

" నిజమా? నాకు తెలిసి మన అపార్ట్ మెంట్ లో అలాంటివాళ్ళెవరూ ఉన్నట్టు వినలేదే? ఇక్కడకి దగ్గర కనక కొంత మంది టీ.వీ నటులు, ఇప్పుడిప్పుడే సినిమాల్లో పైకొస్తున్న నటులు ఉన్నారని విన్నాను, నేనెప్పుడూ టీ.వీ సీరియల్స్ చూడను కనక నాకు వాళ్ళెవరూ తెలీదు." అన్నాను..

" లేదమ్మా, నేను చాలా స్పష్టంగా చూశాను. ఆయన్ని చూసిన ఆనందంలో మీ ఇద్దరికీ చెప్పాలని పరుగు పరుగున వచ్చేశాను. హిందీ రచయిత గుల్జార్ లాఉన్నారు. తెల్లని లాల్చీ పైజామా వేసుకున్నారు. నెమ్మదిగా నడుస్తూ చెవుల్లో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటున్నారు. ఆయన్ని చూసిన ఆనందంలో పలకరించాలని కూడా తోచలేదు, పరుగు పరుగున వచ్చి మీ అమ్మకి చెప్పాలన్న ఆత్రం తప్ప" అంటున్నారు నాన్న.

తన తరపు నటుడిని చూసిన సంబరం ఆయన్ని చిన్నపిల్లాడిని చేసింది. మరో రెండు నిమిషాల్లో అమ్మా నాన్నా ఇద్దరూ పక్క పక్కన సోఫాల్లో కూర్చుని శ్రీధరం గారు నటించిన సినిమాలు, పాత్రలు వాటి విశేషాలు చెప్పేసుకున్నారు.

ఆ తర్వాత నాన్నే అన్నారు.. " ఒకసారి కనుక్కో తల్లీ, ఆయన ఫ్లాట్ నంబర్ ఏమిటో? వెళ్ళి మనం కలవచ్చా? అని కూడా తెలుసుకో!" అన్నారు.

" అంతే కాదు, మనింటికి రమ్మందాం. ఒకవేళ ఆయనే అయితే మనం బోల్డన్ని ఫోటోలు తీసుకుని మీ పెద్దమ్మకి చూపించాలి. ఆయన హీరోగా వేసిన రెండు మూడు సినిమాల కాలం నించి మీ పెద్దమ్మ ఆయనకి పెద్ద అభిమాని." అంది అమ్మ.

" ఆయన హీర గా వేసేవారా? అయినా నాకుతెలీదా?" నేనడిగాను

" తొలినాళ్ళలో వేశారు నాలుగైదు సినిమాల్లో, ఆ తర్వాత మంచి కేరక్టర్లే, మన గుమ్మడిగారిలాగా" అన్నారు నాన్న.

" మీకు తెలిసే అవకాశమేది? మనం మీ చిన్నప్పుడే రాష్ట్రాన్ని వదిలేసి వెళ్ళిపోయాం కదా" అంది అమ్మ.

మొత్తమ్మీద అపార్ట్ మెంట్ కమిటీ దగ్గరకి వెళ్ళి ఆయన వివరాలు కనుక్కునేట్టు నన్ను ఒప్పించారిద్దరూ. మర్నాడు నేను వెళ్ళి కనుక్కున్నాను. పెద్ద కాంప్లెక్స్ అవడం వల్ల సరిగ్గా చెప్పలేకపోయారు.

'ఉన్నారండి మన కాంప్లెక్స్ లో చాలామందే ఆర్టిస్ట్ లు..' అన్నారు. కనుక్కుని చెప్తాం వీలైతే అన్నారు.

నలుగురు శ్రీధర్ లు ఉన్నారు స్వంత ఇల్లు కలవాళ్ళలో అన్నారు. ఇవన్నీ మోసుకొచ్చి నాన్నకి చెప్పాను. ఆయన నిరుత్సాహపడ్డారు.

" ఈ టెక్నాలజీ యుగం లో ఒక్క మనిషి వివరం చెప్పలేరా? " అని కొంచం చిరాకు పడ్డారు.

“పది బ్లాకులున్నాయి నాన్నా! వాళ్ళు మాత్రం మనం అడగ్గానే ఎలా చెప్తారు?కనుక్కుంటానన్నారుగా" అన్నాను నేను.

" పోనీ మీరే రోజూ నిన్న వెళ్ళిన చోటకే వెళ్ళండి. ఆయన మళ్ళీ వాకింగ్ కి వస్తే పట్టుకోవచ్చు" అంది అమ్మ.

ఆ సలహా నచ్చింది నాన్నకి. రోజూ సాయంత్రం నడకకి వెళ్ళడం, ఆయన కనిపించలేదని నిరాశపడి రావడం. ఇలా జరిగింది మరో నాలుగు రోజులు..ఆరు రోజుల తర్వాత కనిపించారు ఆయన. ఆరోజు అమ్మా, నేను కూడా తోడు వెళ్ళాం నాన్నకి. స్కూల్ పిలాడిలా పరుగెత్తుకుని వెళ్ళారు.

నాన్న చెప్పినది నిజమేనని, ఆయన సరిగ్గానే గుర్తు పట్టారని దూరం నుంచి ఆయన్నే చూస్తున్న మాకు తేలిగ్గానే అర్ధం అయింది.

మేమిద్దరం దగ్గరకు వెళ్ళగానే మమ్మల్ని పరిచయం చేశారు.

ఆయనంటే తనకున్న ఇష్టాన్ని, ఆయన చేసిన సినిమాలనే కాదు రాసి, వేసిన నాటకాలకి కూడా తనకెంత అభిమానమో నాన్న వివరించి ఎడతెరిపి లేని ప్రవాహంలా చెప్పేస్తూ ఉంటే అమ్మ ఆయన్ని మధ్యలో ఆపి.

" అన్నీ ఇక్కడ గార్డెన్ లో నిలబెట్టి మాట్లాడేయడమేనా? మనింటికి రమ్మనండి” అనేలోపున నాన్న ఆయన చేతులు పట్టుకుని అదే మాట నాలుగు సార్లు చెప్పేశారు రెండు నిమిషాల్లో.

“అలాగే! తప్పకుండా వస్తాను. రేపటినించీ మూడు రోజులు షూటింగ్ ఉంది. అరవంలో ఓ పిక్చర్ చేస్తున్నా, పొల్లాచ్చి లో షూటింగ్. మూడు రోజులు పని. వచ్చాకా కలుద్దాం” అన్నారాయన చిరునవ్వుతో.

" ఇంకా నటిస్తున్నారా సార్?" అమ్మ అడిగింది.

"నాకై నేను అడగనమ్మా, ఎవరైనా గుర్తు పెట్టుకుని వచ్చి ఇస్తే కాదనను, అది టీ.వీ అయినా సరే, సినిమా అయినా సరే" నవ్వారాయాన.

వానమబ్బుకోసం చూసే నెమలి లా ఎదురుచూశారు నాన్న ‘ఆ మూడురోజులు ఎప్పుడు పూర్తవుతాయా?’ అని.

ఆయన నంబర్, ఇంటి నంబర్ అన్నీ తీసుకున్నారు. మూడంటే మూడు రోజులవగానే ఫోన్ చేసేస్తే బావుండదు, ఎమైనా అనుకుంటారు. ఆయన చేస్తాను అన్నారు కదా! అని ఓ రెండు రోజులు ఆపగలిగింది అమ్మ, ఆపైన ఆవిడ వల్ల కాలేదు.

మర్నాడు నాన్న శ్రీధరం గారిచ్చిన ఫోన్ నంబర్ కి ఫోన్ చేస్తే ఎవరూ ఎత్తలేదు.

" ఆయనకి నాకు ఫోన్ నంబరివ్వడం ఇష్టం లేదేమో! అందుకని ఏదో చెప్పి తప్పించుకున్నరేమో" అంటూ బాధపడసాగారు.

మరో రెండురోజుల నాన్న ఎదురుచూపులకి సమాధానం దొరికింది.

శ్రీధరంగారు ఫోన్ చేసి “ మీరు సాయంత్రం ఫ్రీగా ఉంటారా? ఉంటే మీ అమ్మాయి ఇంటికి వస్తాను" అని..

ఇంతకన్నానందమేమి? అనుకున్నారు నాన్న.

అప్పటికప్పుడు బజారెళ్ళి మూడు స్వీట్లు, రెండు మూడు రకాల కారపు చిరుతిళ్ళు కొనుక్కొచ్చారు. అమ్మని ఇల్లంతా సర్దేయమని గొడవ పెట్టరు.

“ఎంతమంది వస్తారో ఏవిటో? కనుక్కోలేకపోయారు? “అంది అమ్మ. ‘కాఫీలు పెట్టాలి కదా’ అంటూ..

" అంత పెద్ద మనిషిని ఎలా అడగడం? చూద్దాం లే!" అన్నారు న్నాన్న.

" వాళ్ళ మేనేజర్లు, స్టాఫ్ ఇలా చాలా మంది ఉంటారేమోనే,” అంది అమ్మ నాతో.

“నువ్వు కంగారు పడితే ఏమవుతుంది? రానీ చూద్దాం!” అన్నాను నేను కూడా.

ఐదంటే సరిగ్గా ఐదు గంటలకి వచ్చారు ఆయనా, ఆవిడా.

తెల్లటి పైజమా, లాల్చీ, నల్లది సన్నని ఫ్రేమున్న కళ్ళ జోడు. తెలుపు నలుపు కలిసిన రంగు వెయ్యని జుట్టు, మేకప్పనేదే తెలియనట్టున్న స్వచ్ఛమైన ముఖం, ప్రశాంతమైన చిరునవ్వు. పక్కనే ఆవిడ. లేత రంగు నేత చీర, చిన్న పోనీ టెయిల్, సింపుల్ గా సహజంగా ఉన్నారు.

" రండి, రండి.. మీరిద్దరేనా? “అన్నారు నాన్నా ఆయన చేతులు పట్టుకుని ఆహ్వానిస్తూ.

" ఇంట్లో ఉండేది ఇద్దరమేగా, అంతే మంది వచ్చాం. కూర్చోనా?" అన్నారాయన తమాషాగా.

" ఎంత మాట! కూర్చోండి, కూర్చోండి" అన్నారు నాన్న.

" మీరు రావద్దు మేమే వస్తాం అనబట్టి ఆగారు కానీ, లేకపోతే తనే వచ్చి తీసుకొచ్చేవారు" అంది అమ్మ.

ఎప్పటినించో తెలిసినవారితో కబుర్లు చెప్తున్నట్టుగా మాట్లాడుతున్నారు ఆయన నాన్నతో.

అది చూసి నాకు నిజంగానే ఆశ్చర్యం వేసింది..

అప్పుడే అడిగాను..

"క్షమించాలి, మీరు అసలు ఇక్కడున్నట్టు గానీ,మీరింత పెద్ద నటులని గానీ నాకు తెలీదు, మానాన్నగారు చెప్పేవరకూ. మేము మన రాష్ట్రం లో లేకపోవడం ఒక కారణం కూడా" అన్నాను

"పరవాలేదమ్మా, మీ వయసువారికి నేను తెలియకపోవడం వింత కాదు, అయినా పాపులర్ అయినది నా వృత్తి, అక్కడున్నది నేను కనక నా పేరు, రూపం.. మరొకరుంటే వారు. " అన్నారాయన నవ్వుతూ.

"నాకర్ధం కాలేదు సర్!" అన్నాను నేను కూడా నవ్వుతూ..

"మీరు భలేవారు సార్!" అంటూ నాన్న ఏదో చెప్పబోతుంటే

" నిజం గానే గంగాధర్ గారు. నాకు కూడా ఈ విషయం అర్ధం అవడానికి కొంత కాలం పట్టిందనుకోండి" అన్నారు.

"అలాగా? " అంది అమ్మ మధ్యలో.

ఆవిడ నవ్వుతూ చూస్తున్నారు.

"చిన్నప్పటినించీ సినిమాల మీదున్న ఇష్టమనుకోండి, పిచ్చి అనుకోండి.. దానివల్ల చదువు అబ్బలేదు నాకు. ఎర్రగా బుర్రగా ఉంటానని, సినిమాల్లోకెళితే హీరో అయిపోతావని స్నేహితులు, బంధువులు అంటూ ఉంటే నిజమే అనుకున్నాను.

నష్టపోలేదు కానీ కష్టపడ్డాను.. రైలెక్కి మద్రాసు వచ్చినంత సులువు కాదు రాత్రికి రాత్రి నటుడయిపోవడం..

చాలామంది చెప్పేన్ని మరీ ఎక్కువ కష్టాలు కాకపోయినా బానే ఇబ్బందులు పడ్డాను. సినిమాలో హీరొ పక్కన రెండు మూడు సన్నివేశాల్లో కనిపించే చిన్న పాత్రలదగ్గరనించి మొదలయిన నా ప్రయాణం హీరో దాకా రావడానికి బాగానే టైము పట్టింది.

అప్పుడే నేను తెలుసుకున్నాను హీరోగా కంటే వైవిధ్యభరితమైన పాత్రలు వేస్తే ఎక్కువకాలం మనగలం అని. అందుకే జగ్గయ్యగారు, గుమ్మడిగారి బాటలోకి మళ్ళాను.

హీరోగా చేసిన మూడు నాలుగు సినిమాలు చేసినప్పుడు నేనేదో పెద్ద గొప్పవాడినన్న భావం నాకు ఉండేది, దానిద్వారా వచ్చిన తలబిరుసు అదే పొగరు అవన్నీ కరిగిపోవడానికి రెండు ఫ్లాప్ సినిమాలు సరిపోయాయి.

అప్పుడు నాకర్ధమయింది. పేరు వచ్చిందీ, పాపులర్ అయిందీ నా వృత్తి కానీ నేను కాదని. ఏదైనా సంస్థలో నేను పనిచేస్తూ ఉంటే నేనెవరికి తెలుస్తాను? అందరికీ కనిపించే రంగంలో ఉన్నాను కనక తెలిసాను అని అర్ధం అయింది. ఆ రోజునించీ జీవితం పట్ల నా ఆలోచనా విధానం, దృక్పధం అన్నీ మారిపోయాయి.

ఇప్పుడు అర్ధం అయిందా అమ్మా? నేనన్న విషయం వెనక అర్ధం ఏమిటో" అన్నారు చిరునవ్వుతో.

ఎంత గొప్ప విషయం! రెండు సార్లు తెరమీద కనబడగానే కళ్ళు నెత్తికెక్కే నటులూ, ఏదో ప్రపంచాన్నుద్ధరించేట్టు పోజులు కొట్టేవారు ఇలాంటివారినించి ఎంత నేర్చుకోవాలో కదా! అనుకుంటూ ఉండగానే..

" నేను కూడా వస్తానుండండి కాఫీ కలపడానికి !" అంటూ లేచి అమ్మ వెనకే నడిచారు ఆవిడ.

'మేడ్ ఫర్ ఈచ్ అదర్ ' అంటే వీరే! అనుకున్నాను ముచ్చటగా.

●●●

Click here to share your comments on this story